నమస్తే తెలంగాణ
నల్లగొండ
I | నల్లగొండ, ఆదివారం 13 ఏప్రిల్ 2025 | NALGONDA

విద్యార్థులు ప్రపంచంతో పోటీ పడాలి

- గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

కళాశాల స్నాతకోత్సవంలో మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

చౌటుప్పల్ రూరల్, ఏప్రిల్ 12 : ప్రతి విద్యార్థి టెక్నాలజీని అందిపుచ్చుకొని ప్రపంచంతో పోటీ పడాలని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. శనివారం చౌటుప్పల్ మండలం తూప్రాన్‌పేట గ్రామంలోని అశోక ఇంజినీరింగ్ కళాశాల స్నాతకోత్సవంలో ఆయన పాల్గొని విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ రోజురోజుకూ కొత్త టెక్నాలజీ పుట్టుకొస్తున్నదన్నారు. విద్య అనే ఆయుధంతో పోటీ ప్రపంచంలో భవిష్యత్‌ను రూపుదిద్దుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి సామాజిక బాధ్యతను అవగతం చేసుకోవాలన్నారు.

గ్యాస్ సబ్సిడీ గాయబ్

మూణ్నాళ్ల ముచ్చటగానే కాంగ్రెస్ హామీ

వినియోగదారులకు ఐదు నెలలుగా అందని సబ్సిడీ
అభయహస్తం పేరిట అరకొర కనెక్షన్లకే పరిమితం
మరోవైపు ధరలు పెంచి మరింత భారం మోపిన కేంద్రం

ఆత్మకూరు(ఎం) : కూరెళ్లల్లో గ్యాస్ ధరలను తగ్గించాలని కోరుతూ.. ధర్నా చేస్తున్న మహిళలు, సీపీఎం నాయకులు

ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఊదరగొట్టిన హామీల్లో గ్యాస్ సబ్సిడీ ఒకటి. తాము అధికారంలోకి వస్తే గృహ వినియోగానికి సంబంధించి ప్రతి గ్యాస్ సిలిండర్‌కు రూ.500 సబ్సిడీని ఇస్తామని రేవంత్‌రెడ్డి సహా ఆ పార్టీ నేతలంతా ఊరూరా ప్రచారం చేశారు. తీరా పాలనా పగ్గాలు చేపట్టాక అభయహస్తం పేరిట ఒకటి రెండు సిలిండర్లకే పరిమితం చేసి చేతులు దులుపుకొన్నారు. ఐదు నెలలుగా సిలిండర్ల సబ్సిడీ అందడం లేదని వినియోగదారులు వాపోతున్నారు.

– సూర్యాపేట, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ)

కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల్లో హామీ ఇచ్చిన పథకాల్లో మరొకటి మాయమవుతున్నది. ఆరు గ్యారెంటీలు, అనేక హామీలు ఇవ్వగా, అధికారంలోకి వచ్చిన తరువాత ఒకటీఅరా ప్రారంభించి వాటికి కూడా మధ్యలోనే మంగళం పాడుతున్నది. తాజాగా గ్యాస్ సిలిండర్ వినియోగదారులకు మహాలక్ష్మి పథకం పేరిట అమలు చేస్తామన్న సబ్సిడీని అందించడం లేదు. సిలిండర్ రూ.500 సబ్సిడీ చొప్పున అకౌంట్‌లో వేస్తామని చెప్పి ఇప్పుడు మొహం చాటేస్తున్నది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొత్తం 12.94 లక్షల కనెక్షన్లు ఉండగా, దాదాపు ఐదు నెలలుగా సబ్సిడీ అందడం లేదు. నల్లగొండ జిల్లాలో 6.18 లక్షలు, సూర్యాపేటలో 4.24 లక్షలు, యాదాద్రి భువనగిరి జిల్లాలో 2.52 లక్షలు ఉన్నాయి. వాటిల్లో సగం మందికి కూడా సబ్సిడీ అందుతున్న దాఖలాలు లేవు. సూర్యాపేట జిల్లాలో ఏడాది కాలంలో సగటున తక్కువలో తక్కువ ఒక్కో కనెక్షన్‌కు నాలుగు సిలిండర్లు తీసుకున్నా 16.96 లక్షల సిలిండర్లు వినియోగం జరిగినట్లు పౌర సరఫరాల శాఖ అధికారుల అంచనాలే చెప్తున్నాయి. ఆ లెక్కన సిలిండర్ ఒక్కంటికి రూ.500 చొప్పున ఇప్పటి వరకు జిల్లా ప్రజలకు 84.80 కోట్ల రూపాయలు సబ్సిడీ రూపంలో అందాల్సి ఉంది. కాగా, 13 నెలల కాలంలో జిల్లాలో 4,61,714 సిలిండర్లకు 13.23 కోట్లు మాత్రమే అందడం గమనార్హం. హామీల్లో భాగంగా కాంగ్రెస్ అరకొరగా అమలు చేసిన పథకాల జాబితాలో మహాలక్ష్మి గ్యాస్ పథకం కూడా చేరింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను ఇలా మోసం చేస్తుండగా, మరోవైపు కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్‌పై 50రూపాయలు పెంచి అదనపు భారం మోపుతున్నది. పెంచిన ధరలు తగ్గించాలని ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నిత్యం ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి.

గ్యాస్ సబ్సిడీ ఎన్నడూ రాలేదు

ఎన్నికల కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన గ్యాస్ సబ్సిడీ మాకు ఇంతవరకు అందనే లేదు. ఏడాదిన్నరలో ఒక్కసారి కూడా సబ్సిడీ పడలేదు. సిలిండర్ ధరలు బాగా పెరిగిన క్రమంలో సబ్సిడీ కొంత ఊరట ఇస్తుందని అనుకున్నాం. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం మాకు మొండిచెయ్యే చూపింది. ఇప్పటికైనా ఇచ్చిన హామీ మేరకు సబ్సిడీ అందించాలి.

-నీరజ, గృహిణి, మఠంపల్లి

మూడు సిలిండర్లు నింపినా సబ్సిడీ పడలేదు

కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద గ్యాస్ సిలిండర్‌పై ఇస్తామన్న500 రూపాయల సబ్సిడీ మా అకౌంట్‌లో పడడం లేదు. ఇప్పటి వరకు మూడుసార్లు సిలిండర్ నింపించినా ఒక్కసారి కూడా సబ్సిడీ డబ్బులు జమ కాలేదు. ప్రభుత్వం ఇప్పటికైనా సబ్సిడీపై సిలిండర్లు అందించాలి.

-కొండగడుపుల లక్ష్మి, గృహిణి, తుంగతుర్తి

సోమేశ్వర్‌రెడ్డిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి పరామర్శ

నాగారం, ఏప్రిల్ 12: మండల పరిధిలోని డి.కొత్తపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు సుక్కాని సోమేశ్వర్‌రెడ్డి ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి శనివారం సోమేశ్వర్‌రెడ్డిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. జగదీశ్ రెడ్డి వెంట నాగారం మాజీ వైస్ ఎంపీపీ గుంటకండ్ల మణిమాల, సూర్యాపేట మాజీ జడ్పీటీసీ జీడి భిక్షం, మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్, సూర్యాపేట మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పుట్ట కిశోర్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుండగాని అంబయ్య, చిప్పలపల్లి చిరంజీవి, గ్రామ మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, గంగయ్య తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు, తిప్పన విజయసింహారెడ్డి

బీఆర్ఎస్ బహిరంగ సభను విజయవంతం చేయాలి

- మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు

మిర్యాలగూడ, ఏప్రిల్ 12 : వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు పిలుపునిచ్చారు. మిర్యాలగూడ పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డితో కలిసి బహిరంగ సభ పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించి మాట్లాడారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పార్టీ శ్రేణులకు ఈ సభ ద్వారా దిశానిర్దేశం చేస్తారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులను కన్న బిడ్డలుగా చూసుకొని వారి అభివృద్ధికి పాటుపడిందని, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం అన్నదాతలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని తెలిపారు. రైతులకు రైతు భరోసా ఇవ్వకుండా మోసం విమర్శించారు. ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని, అది గ్రహించే గ్రామపంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలను వాయిదా వేసుకుంటూ పోతున్నదని అన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని, మళ్లీ వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమేనని సూచించారు. కార్యక్రమంలో నాయకులు యడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, అన్న భీమోజు నాగార్జునాచారి, ఎండీ మగ్దుంపాషా, ఎండీ ఇలియాస్‌ఖాన్, ఐల వెంకన్న, తలకొప్పుల శ్రీధర్‌రెడ్డి, పిన్నబోయిన శ్రీనివాస్‌యాదవ్, భీమ్లా నాయక్, దినేశ్, దుర్గాప్రసాద్, చిరంజీవి, చందు యాదవ్, ఈశ్వరచారి పాల్గొన్నారు.

పాదయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్‌వీ నాయకులు

బీఆర్ఎస్‌వీ పాదయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 12 : వరంగల్ జిల్లాలో నిర్వహించే బీఆర్ఎస్ బహిరంగ సభను విజయవంతం చేయాలని, మూడోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ బీఆర్ఎస్‌వీ ఆధ్వర్యంలో ఈ నెల 14న రాయగిరి నుంచి యాదాద్రి లక్ష్మీనర్సింహస్వామి దేవాలయం వరకు నిర్వహించే పాదయాత్ర పోస్టర్‌ను భువనగిరి పట్టణంలో మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు ఒగ్గు శివకుమార్, జిల్లా కో ఆర్డినేటర్ దేవరపల్లి ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ పాదయాత్రకు ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలతోపాటు బీఆర్ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు తుంగ బాలు హాజరవుతారని తెలిపారు. పాదయాత్రలో జిల్లా నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్‌వీ భువనగిరి నియోజకవర్గ ఉపాధ్యక్షులు ఎండీ మున్నా, ఏర్పుల అరవింద్, ఆలేరు నియోజకవర్గ ఇన్‌చార్జి రకాల రమేశ్, భువనగిరి, బీబీనగర్ మండలాల అధ్యక్షులు కనకాల మహేశ్, పచ్చిమట్ల వంశీగౌడ్, నాయకులు కిరణ్, సాయికుమార్, మహేశ్, సతీశ్, శ్రావణ్, పవన్, నర్సింహ, వంశీ పాల్గొన్నారు.

మహనీయుల ఆశయాలు సాధించాలి

రాజాపేట : బొందుగులలో బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఆవిష్కరణ సభలో అభివాదం చేస్తున్న ప్రభుత్వ విప్ ఐలయ్య, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత తదితరులు

- బొందుగులలో బీఆర్ అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఆవిష్కరణలో వక్తలు
- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, మాజీ మంత్రి మోత్కుపల్లి, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత హాజరు

రాజాపేట, ఏప్రిల్ 12 : మహనీయుల ఆశయాల సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని బొందుగుల గ్రామంలో రిలీజ్ యూత్ సభ్యులు నెలకొల్పిన బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలను మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులుతో కలిసి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సమానత్వం కోసం భారత రాజ్యాంగాన్ని నిర్మించిన మహానుభావుడు అంబేద్కర్ అన్నారు. అందరివాడైన ప్రపంచ మేధావి డాక్టర్ అంబేద్కర్ జన్మదిన వేడుకలను దేశ, విదేశాల్లో జరుపుకొంటున్నారని తెలిపారు. మహనీయుల చరిత్ర భావితరాలకు అందించేందుకు విగ్రహాలు నెలకొల్పడం అభినందనీయమన్నారు. డీఏ స్పీ రవికుమార్, మీర్‌పేట్ మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, విగ్రహదాత కొమ్ము ఉపేందర్, ప్రజా సంఘాల నాయకులు జూకంటి ప్రవీణ్, కొమ్ము చంద్రయ్య, కొమ్ము పాండు, పెంటయ్య గౌడ్, మోత్కుపల్లి ప్రవీణ్, గంధమల నర్సింహులు, సట్టు తిరుమలేశ్, గొల్లూరి అశోక్, ప్రభాకర్, ప్రకాశ్, కొండూరి స్వామి, మహేశ్, స్వామి పాల్గొన్నారు.

సభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల

రజతోత్సవ సభకు పెద్ద సంఖ్యలో తరలి రావాలి

- మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

చండూరు, ఏప్రిల్ 12 : వరంగల్ జిల్లాలో ఈ నెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు మండలం నుంచి పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలి రావాలని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. చండూరు మండల కేంద్రంలో శనివారం చలో వరంగల్ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ ఏర్పడి 25 సంవత్సరాలు పూర్తి కానుందన్నారు. కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ సాధించి రాష్ట్రాన్ని దేశంలోనే అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపారని చెప్పారు. ఇంటింటికీ నల్లా నీళ్లు ఇచ్చి మునుగోడు ప్రాంతంలో ఫ్లోరోసిస్ లేకుండా చేసిన ఘనత కేసీఆర్‌దేనని తెలిపారు. రైతుబంధు, ఉచిత విద్యుత్, సాగునీళ్లు ఇచ్చి రైతులకు మేలు చేశారన్నారు. అందరి చూపు కేసీఆర్ వైపు ఉందని, రానున్న రోజుల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించుకునే బాధ్యత తనదేనని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు పాల్వాయి స్రవంతి, మునగాల నారాయణరావు, జిల్లా నాయకులు మధుసూదన్‌రావు, మండల, పట్టణ అధ్యక్షులు బొమ్మరబోయిన వెంకన్న, కొత్తపాటి సతీశ్, నాయకులు తోకల వెంకన్న, గుర్రం మాధవి, అన్నెపర్తి శేఖర్, గుంటి వెంకటేశం, సుదర్శన్, సతీశ్‌గౌడ్, అనిల్‌రావు, వెంకన్న, జానయ్య, చంద్రశేఖర్, గీత, సువర్ణ పాల్గొన్నారు.

పాలకవీడులో బీఆర్ఎస్ రజతోత్సవ సభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆ పార్టీ హుజూర్‌నగర్ నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నర్సింహారెడ్డి, నాయకులు

రజతోత్సవ సభకు వేలాదిగా తరలి రావాలి

- బీఆర్ఎస్ హుజూర్‌నగర్ నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నర్సింహారెడ్డి

పాలకవీడు/ హుజూర్‌నగర్, ఏప్రిల్ 12 : బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ప్రజలు వేలాదిగా తరలి రావాలని ఆ పార్టీ హుజూర్‌నగర్ నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పాలకవీడు మండలం గుడుగుంట్లపాలెం, హుజూర్‌నగర్ పట్టణంలో రజతోత్సవ సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలంగాణ ప్రజల ఇబ్బందులను చూసి ప్రాణాలను పణంగా పెట్టి స్వరాష్ట్రాన్ని సాధించారన్నారు. కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రంలో స్వర్ణయుగ పాలన అందించారని తెలిపారు. వ్యవసాయాన్ని పండుగలా చేశారని చెప్పారు. సమావేశాల్లో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కిష్టిపాటి అంజిరెడ్డి, మాజీ జడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, జిల్లా నాయకులు కేఎల్ఎన్ రెడ్డి, జక్కుల నాగేశ్వర్‌రావు, అమర్‌గౌడ్, నబీ, పసుపులేటి సైదులు, రామారావు, గౌస్, సతీశ్, సైదిరెడ్డి, మమత, సైదయ్య పాల్గొన్నారు.


సర్వేల్ గురుకులంలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

సర్వేల్ గురుకులంలో అర్ధ శతాబ్దపు ఆత్మీయ సమ్మేళనం

సంస్థాన్ నారాయణపురం, ఏప్రిల్ 12 : మండలంలోని సర్వేల్ గురుకుల పాఠశాలలో 1975 సంవత్సరంలో చదువుకున్న రెండో బ్యాచ్ కు చెందిన 40 మంది పూర్వ విద్యార్థులు గురువారం అదే పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. యాభై ఏండ్ల తరువాత కలిసిన మిత్రులు తమ చిన్ననాటి విషయాలను నెమరువేసుకున్నారు. తరగతి గదులు కలియ దిరిగి సెల్ఫీలు దిగుతూ సరదాగా గడిపారు. నూతన గురుకుల పాఠశాల భవనాలను సందర్శించి సంతోషం వ్యక్తం చేశారు.

యాదాద్రి పవర్‌ప్లాంట్‌కు రామగుండం ఉద్యోగులు

దామరచర్ల, ఏప్రిల్ 12: మండలంలోని యాదాద్రి పవర్‌ప్లాంటుకు కొత్తగా 104 మంది ఇంజినీర్లు, ఉద్యోగులను రానున్నారు. రామగుండంలో పవర్ ప్లాంట్ మూసివేయడంతో అక్కడ పని చేస్తున్న ఇంజినీర్లు, ఉద్యోగులను తెలంగాణ జెన్‌కో యాదాద్రి పవర్‌ప్లాంట్‌కు బదిలీ చేస్తూ ఈ నెల 11న ఉత్తర్వులు జారీ చేసింది. వారంతా వచ్చి ఉద్యోగాల్లో చేరనున్నారు. వీరితో పాటు గతంలో పాల్వంచ, శ్రీకాకుళం నుంచి ఉద్యోగులు, ఇంజినీర్లను సైతం ప్లాంట్‌లో నియమించారు. ఇప్పటికి పవర్‌ప్లాంట్‌లో ఒక యూనిట్ మాత్రమే 800 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తుండగా రెండో యూనిట్ ట్రైయల్ రన్ నిర్వహిస్తున్నారు.

గలీజు దందా

అగ్రిమెంట్ ఒకరిది.. వ్యాపారం మరొకరిది

- కొండమల్లేపల్లి పాలశీతలీకరణ కేంద్రం దుకాణ సముదాయాల్లో సబ్ లీజులు
- రెట్టింపు అద్దె వసూలు చేస్తున్న లీజుదారులు
- మదర్ డెయిరీకి చెల్లించేది మాత్రం సగమే..
- నేతల చేతుల్లో దుకాణాలు.. చర్యలకు వెనుకాడుతున్న అధికారులు

కొండమల్లేపల్లి బస్టాండ్ పక్కన ఉన్న పాలశీతలీకరణ కేంద్రం దుకాణాల సముదాయం

కొండమల్లేపల్లి, ఏప్రిల్ 12 : కొండమల్లేపల్లి పట్టణంలో మదర్‌డెయిరీకి చెందిన దుకాణాలను అగ్రిమెంట్ చేసుకున్నది ఒకరైతే.. వ్యాపారాలు మరొకరు నిర్వహిస్తున్నారు. పాలశీతలీకరణ కేంద్రం దుకాణాలను వేలంలో దక్కించుకున్న లీజుదారులు షాపులు ఏర్పాటు చేయకుండా రెట్టింపు ధరకు సబ్ లీజుకు ఇచ్చి ఆదాయం పొందుతున్నారు. ఎక్కువ శాతం మంది నాయకులు, పట్టణ ప్రముఖులు ఈ దుకాణాలను దక్కించుకోవడంతో అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. పదేండ్లకోసారి లీజును పునరుద్ధరించాలి. లేదా అక్రమాలుంటే రద్దు చేయాలి. కానీ.. అధికారులు పట్టించుకోకపోవడంతో ఆదాయం భారీగా తగ్గింది. బయటి మార్కెట్ కంటే చాలా తక్కువ అద్దె ఇస్తుండడంతో పాలశీతలీకరణ కేంద్రానికి నష్టం వాటిల్లుతున్నది.

రెట్టింపు ధరకు సబ్ లీజు

కొండమల్లేపల్లి పట్టణం నడిబొడ్డున హైదరాబాద్ రోడ్డులో పాలశీతలీకరణ కేంద్రం ఆదాయాన్ని పెంచేందుకు 20 ఏండ్ల కిత్రం నాలుగు వాణిజ్య సముదాయాలను ఏర్పాటు చేశారు. బస్టాండ్ ఎదురుగా ఫేజ్ 1లో 29 దుకాణాలు, ఫేజ్ 3లో 15, ఫేజ్ 4లో 22, బస్టాండ్ పక్కన ఫేజ్ 2లో 28 దుకాణాలు.. మొత్తం 94 దుకాణాలను నిర్మించారు. అప్పటి నుంచి ఈ షాపులను లీజుకు ఇస్తున్నారు. దుకాణాలను తక్కువ ధరకు దక్కించుకున్న వారు రెట్టింపు ధరకు సబ్ లీజుకు ఇచ్చి లాభాలు గడిస్తున్నారు. ఒక్కో దుకాణానికి రూ.3వేల నుంచి రూ.7500 వరకు పాలశీతలీకరణ కేంద్రానికి అద్దె చెల్లిస్తున్నారు. ఒక్కో దుకాణదారుడు ఫేజ్ 1లో రూ.25వేలు, ఫేజ్ 2లో రూ.50వేలు, ఫేజ్ 3లో రూ.30వేలు, ఫేజ్ 4కు రూ.2లక్షల వరకు అడ్వాన్స్ ఇచ్చారు. ఇప్పుడు అన్ని షాపులకు కలిపి రూ.5లక్షల వరకు నెలకు అద్దె వసూలు అవుతున్నది. వేలంలో మడిగెలు దక్కించుకున్న ఎక్కువ మంది షాపులు పెట్టకుండా ఇతరులకు లీజుకు ఇస్తూ రూ.10వేల నుంచి రూ.20వేల వరకు అద్దె పొందుతున్నారు. ఫేజ్ 1లో లీజు దక్కించుకున్న వారు సబ్ లీజుకు రూ.20వేలు తీసుకుని పాలశీతలీకరణ కేంద్రానికి రూ.7,292 మాత్రమే చెల్లిస్తున్నారు. ఫేజ్ 2లో లీజుదారుడు రూ.10వేలకు పైగా తీసుకుని పాలశీతలీకరణ కేంద్రానికి రూ.5వేలు అద్దె చెల్లిస్తున్నాడు. ప్రతి ఏడాది మూడు శాతం అద్దె పెంచుతారు. పదేండ్లకు ఒకసారి లీజు రెన్యూవల్ చేయాలి. లేకుంటే లీజును రద్దు చేసి మళ్లీ వేలం వేసి టెండర్ ద్వారా వేరే వారికి ఇవ్వాలి. కానీ.. దాదాపు 20 ఏండ్లు దాటుతున్నా సబ్ లీజుకు ఇచ్చిన వారిని అధికారులు గుర్తించడంలేదు. సబ్ లీజుకు ఇచ్చి ఎక్కువ అద్దె పొందుతున్న వారి లీజులు రద్దు చేస్తే పాలశీతలీకరణ కేంద్రానికి రెట్టింపు అద్దెలు, అడ్వాన్స్‌లు వస్తాయి.

లీజుకు తీసుకున్న వ్యక్తులు నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తూ మరొకరికి షాపును ఇస్తే స్వాధీనం చేసుకోవచ్చు. కానీ.. ఆ దిశగా చర్యలు తీసుకోవడంలేదు.

కొండమల్లేపల్లి పట్టణంలో పాలశీతలీకరణ కేంద్రం నిధులతో నిర్మించిన నాలుగు షాపింగ్ కాంప్లెక్స్‌లలో అధిక శాతం దుకాణాలు నాయకులు, పట్టణ ప్రముఖుల చేతుల్లోనే ఉన్నాయి. అందుకే దుకాణాలను సబ్ లీజుకు ఇచ్చినా అధికారులు చర్యలకు వెనుకాడుతున్నారు. రాష్ట్రంలో మదర్ డెయిరీ నష్టాల్లో ఉందని చెబుతున్నారే తప్ప.. కొండమల్లేపల్లిలోని మదర్ డెయిరీ షాపింగ్ కాంప్లెక్స్ ద్వారా ప్రస్తుతం ఏటా రూ.60 లక్షల ఆదాయం వస్తున్నది. సబ్ లీజులను రద్దు చేస్తే ఈ ఆదాయం రెట్టింపు అవుతుంది. పదేండ్లలో దాదాపుగా రూ.12 కోట్ల అద్దెతోపాటు అడ్వాన్స్‌గా కోట్ల రూపాయలు వస్తాయి. ఈ దిశగా కొండమల్లేపల్లి పట్టణ పాలశీతలీకరణ కేంద్రం, రాష్ట్ర మదర్ డెయిరీ అధికారులు ముందడుగు వేస్తే మంచిదని పట్టణ ప్రజలు పేర్కొంటున్నారు. ఈ విషయంపై పాలశీతలీకరణ కేంద్రం మేనేజర్ శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. పై అధికారుల అదేశాల మేరకు ప్రస్తుతం జీఎస్టీ సహా అద్దె వసూలు చేస్తున్నామన్నారు. అగ్రిమెంట్ చేసుకున్న వారు మరొకరికి లీజుకు ఇచ్చిన విషయం తమ దృష్టికి రాలేదని, ఎవరైనా ఫిర్యాదు చేస్తే అధికారులకు తెలుపుతామని చెప్పారు.